గురువారం 20 జూన్ 2024

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

24న కేబినెట్ భేటీ 4

రుషికొండ భవనాల వినియోగంపై చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారు: డోలా 4

భారీగా ఐఏఎస్‌ల బదిలీలు 6

# జయహో అమరావతి!



◆ నేడు రాజధానిలో చంద్రబాబు పర్యటన ◆ ముఖ్యమంత్రి టూర్‌పై సర్వత్రా ఆసక్తి

◆ ఐదేళ్లుగా.. అమరావతిని అలముకున్న చీకట్లు ◆ జగన్ నిర్వాకంతో నష్టపోయిన రాష్ట్రం

◆ వైసీపీ నిర్లక్ష్యం కారణంగా నష్టాలపై నేడు అంచనాలు?

2

అమరావతి రూపంలో.. అంతర్జాతీయస్థాయి రాజధాని నగరాన్ని ఆంధ్రావనికి అందించాలన్న చంద్రబాబు సంకల్పం నేటినుంచి మళ్లీ మొదలవుతుంది. 29 గ్రామాల పరిధిలో 217 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో తొమ్మిది నగరాల సమాహారంగా అమరావతి నిర్మాణం సాగించాలన్నది చంద్రబాబు సంకల్పం. ఐదుకోట్ల ప్రజలు కూటమిని గెలిపించుకున్నది ఈ బృహత్కార్యం కోసమే. 34 వేల ఎకరాల పైరుపచ్చని భూములను స్వచ్ఛందంగా ఇచ్చిన 29వేల అమరావతి రైతు కుటుంబాల చారిత్రక పోరాట లక్ష్యమూ అదే. అప్పట్లో -ప్రతిష్ఠాత్మక ప్రజా రాజధాని నిర్మాణంలో భాగమయ్యేందుకు అనేక దేశాలు ఉవ్విళ్లూరాయి. వేలకోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ప్రయివేట్ సంస్థలూ ఉత్సాహం చూపించాయి. రుణ సౌకర్యం కల్పిస్తామంటూ ప్రపంచ బ్యాంకు, ఆసియా మౌలికవసతులు, పెట్టుబడుల బ్యాంకులూ కదిలాయి. ప్రపంచంలోని ఆరు భవిష్యత్ నగరాల్లో అమరావతి ఒకటంటూ న్యూయార్క్ పత్రిక 'ఆర్కిటెక్చరల్ డైజెస్ట్' సైతం కథనం రాసుకొచ్చింది. ఇదంతా గతం. రాష్ట్రంలో ఐదేళ్ల రాక్షస పాలన అంతమై -మళ్లీ చంద్రబాబు గద్దెనెక్కారు. రాజధానిని చక్కదిద్దుతానన్న చంద్రబాబు మాటతో ప్రజలూ ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధాని పరిశీలనకు వెళ్తుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.



## డిప్యూటీ సీఎంగా పవన్ బాధ్యతల స్వీకరణ

ఉపాధి హామీ పథకాన్ని ఉద్యాన పంటల పనులకు అనుసంధానించే ఫైల్‌పై తొలి సంతకం

4

## 'ప్రజాదర్బార్'కు జనం బారులు!

ప్రత్యేక యంత్రాంగంతో సమస్యల పరిష్కారానికి లోకేష్ కృషి





3



## డీజీపీగా ద్వారకా తిరుమలరావు

అమరావతి: ఏపీ నూతన డీజీపీగా ద్వారకా తిరుమలరావు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1989 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ద్వారకా తిరుమలరావు ప్రస్తుతం ఆర్టీసీ ఎండీగా పనిచేస్తున్నారు. ఆ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటి వరకు డీజీపీగా ఉన్న హరీష్‌గుప్తాను మళ్లీ హెూం సెక్రటరీగా బదిలీ చేశారు.

## ప్రభుత్వ జీతం.. పార్టీ పని!

◆ వేలసంఖ్యలో పొరుగు సేవల ఉద్యోగులుగా వైసీపీ కార్యకర్తలు

◆ ఆఫీసుకు వెళ్లకుండానే వేతనాలు చెల్లింపు

◆ సర్కారీ సొమ్ము అడ్డగోలుగా స్వాహా

◆ ఒక్కొక్కటిగా బయట పడుతున్న అక్రమాలు

5

## పోలీసులు ప్రజలకోసం పనిచేయాలి

### స్పష్టం చేసిన హెూంమంత్రి అనిత

- ప్రత్యేక పూజల అనంతరం బాధ్యతల స్వీకరణ
- శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నేతలు, ఉన్నతాధికారులు
- గత ప్రభుత్వ ఆలోచనలున్న పోలీసులు పక్కకు తప్పుకోవాలని సూచన
- దిశ పోలీస్ స్టేషన్ల పేరును మారుస్తామని వెల్లడి
- సోషల్ మీడియాలో రెచ్చిపోతే కఠిన చర్యలుంటాయని హెచ్చరిక

4



## 14 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర పెంపు

❑ రెండు లక్షల గోడౌన్ల నిర్మాణం

❑ కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

- వివరాలు 14 లో..

## జగన్ అసెంబ్లీకి రావాలి: పయ్యావుల

- అభివృద్ధి, సంక్షేమంపై అర్థవంతమైన చర్చ జరగాలని ఆకాంక్ష
- చంద్రబాబు సారథ్యంలో పారదర్శక పాలన అందిస్తామని హామీ



- వివరాలు 4 లో..



# జయహో అమరావతి!

- నేడు రాజధానిలో చంద్రబాబు పర్యటన
- ముఖ్యమంత్రి టూర్‌పై సర్వత్రా ఆసక్తి
- ఐదేళ్లుగా.. అమరావతిని అలముకున్న చీకట్లు
- జగన్ నిర్వాకంతో నష్టపోయిన రాష్ట్రం
- వైసీపీ నిర్లక్ష్యం కారణంగా నష్టాలపై నేడు అంచనాలు?

అమరావతి (చైతన్య రథం): ఐదు కోట్ల ఆంధ్రుల కల -మళ్లీ జీవం పోసుకుంటోంది. రాష్ట్రాభివృద్ధికి ఆయువుపట్టులాంటి అమరావతిలో చంద్రబాబు పర్యటన ఆంధ్రావనిలో ఆసక్తి రేకెత్తిస్తోంది. ప్రపంచంలో ఏమూలనున్నా.. 'నా ఆంధ్ర.. నా అమరావతి' అని బోరవిరుచుకుని చెప్పుకోగలిగే రోజుకోసం చాలాకాలంగానే రాష్ట్రప్రజలు ఎదురు చూస్తున్నారు. వైసీపీ గద్దెనెక్కిన దగ్గర్నుంచీ.. ప్రపంచ వేదికలమీద రాజధాని ప్రస్తావన వచ్చిన ప్రతిసారీ ఆంధ్రావని నేలచూపులు చూస్తూనే ఉండిపోయింది. రాజధాని విలువ తెలియని పాలకవాజమ్మ గద్దెపైనుంచి గొప్పలు చెప్పడం వినా.. రాష్ట్ర రాజధానిని పట్టించుకున్న పాపాన పోలేదు. పైగా 'అమరావతి'పై పగబట్టిన అసుర పాలకుడు- ఆంధ్రావని ఆశలను కాలరాశాడు. అమరావతి నిర్మాణ మహాయజ్ఞాన్ని మలినం చేశాడు. 2017లో తెదేపా సారథ్యంలో శరవేగంగా అమరావతి పనులు మొదలైన సమయంలో జగన్ కపట మాటల్ని ఇక్కడ ప్రస్తావించుకోవాలి. 'నేను అధికారంలోకి వస్తే అమరావతిలో రాజధాని ఉండదని, ఇక్కడినుంచి మార్చేస్తానని సీఎం చంద్రబాబు పదేపదే చెప్తున్నారు. విజయవాడ-గుంటూరు మధ్యనున్న సీఆర్డీఏ ప్రాంతంలోని అమరావతి గడ్డనుంచే చెప్తున్నా. ఎప్పటికీ రాజధాని అమరావతేనంటూ ప్రకటించాడు జగన్. జనం నమ్మారు. 2019లో జగన్‌ను గద్దెనెక్కించారు. తరువాత పెత్తందారు నిజస్వరూపం బయటపడింది.

రాష్ట్రంలో ఐదేళ్లపాటు అప్రతిహత విధ్వంసం సాగిపోయింది. బాబుపై పగబట్టి.. ప్రజా రాజధానిని మట్టుబెట్టాడు. అమరావతి గుండెల్లో దింపిన గున పాల శబ్దాలు.. ఆంధ్రుల గుండెల్లో ఎప్పటికీ ప్రతిధ్వని స్తాయి. ఏపీ ప్రగతి దీపాన్ని నిర్దాక్షిణ్యంగా ఆర్పేసిన ప్రజాద్రోహి జగన్!

జగన్ భ్రష్టపాలన కారణంగా అమరావతి ఎక్కడ ఆగిందో అక్కడినుంచే మొదలవుతుందా? ప్రజా రాజధాని వాస్తవ పరిస్థితి ఏమిటి? కూటమి ప్రభు త్వాన్ని అధికారంలోకి తెచ్చుకున్న దగ్గర్నుంచీ ఈ అంశాలపై నవ్యాంధ్రుల్లో ఆసక్తి కనిపిస్తోంది. అయితే, అమరావతి రూపశిల్పి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మాత్రం రాజధానిని సాధ్యమై నంత త్వరగానే సాకారం చేయగలదన్న విశ్వాసంతో రాష్ట్రంవుంది. ఐదేళ్ల చెరవీడిన అమరావతి రామన్న ఐదేళ్లలో వడివడి అడుగులేసి ఒక రూపాన్ని సంత రించుకుంటుందన్న ఆశ ప్రజల్లో కనిపిస్తోంది.

**అమరావతి రూపంలో.. అంతర్జాతీయస్థాయి రాజధాని నగరాన్ని ఆంధ్రావనికి అందించాలన్న చంద్రబాబు సంకల్పం నేటినుంచి మళ్లీ మొదలవుతుంది. 29 గ్రామాల పరిధిలో 217చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో తొమ్మిది నగరాల సమాహారంగా అమరావతి నిర్మాణం సాగించాలన్నది చంద్రబాబు సంకల్పం. ఐదు కోట్ల ప్రజలు కూటమిని గెలిపించుకున్నది ఈ బృహత్కార్యం కోసమే. 34వేల ఎకరాల పైరు పచ్చని భూములను స్వచ్ఛందంగా ఇచ్చిన 29వేల అమరావతి రైతు కుటుంబాల చారిత్రక పోరాటలక్ష్యమూ అదే.అప్పట్లో - ప్రతిష్టాత్మక ప్రజా రాజధాని నిర్మా ణంలో భాగమయ్యేందుకు అనేక దేశాలు ఉవ్విళ్లూరాయి. వేలకోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ప్రయివేట్ సంస్థలూ ఉత్సాహం చూపించాయి. రుణసౌకర్యం కల్పిస్తామంటూ ప్రపంచ బ్యాంకు, ఆసియా మౌలికవసతులు, పెట్టుబడుల బ్యాంకులూ కదిలాయి. ప్రపంచంలోని ఆరు భవిష్యత్ నగరాల్లో అమరావతి ఒకటంటూ న్యూయార్క్ పత్రిక 'ఆర్కిటెక్చరల్ డైజెస్ట్' సైతం కథనం రాసు కొచ్చింది. ఇదంతా గతం. రాష్ట్రంలో ఐదేళ్ల రాక్షస పాలన అంతమై-మళ్లీ చంద్రబాబు గద్దెనెక్కారు. రాజధానిని చక్కదిద్దుతానన్న చంద్రబాబు మాటతో ప్రజలూ ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధాని పరిశీలనకు వెళ్తుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.**

## కష్టాలు.. నష్టాలు

రాజధాని పునర్నిర్మాణంపై ప్రజల ఆకాంక్ష ఎంత బలంగా ఉందో, వైసీపీ నిర్వాకంతో నష్టం అంతకంటే ఎక్కువుంది. జగన్‌లాంటి రాక్షస మూకలు భవిష్యత్‌లో రాజధానివైపు కన్నెత్తి చూడకుండా చేయాలంటే.. అమరావతిని సుస్థిరపర్చడం నుంచే సర్కారుకు సవాలు మొదలవుతుంది. అకుంఠిత లక్ష్యాలు, ఆచరణాత్మక ప్రణాళికలు నిర్దేశించుకుని.. ఆంధ్రావని ఆశలమేరకు మొదటి దశ పూర్తి చేయాల్సిన బృహత్తర బాధ్యత ప్రభుత్వంపై ఉంది. నిజానికి, అఖిల భారత సర్వీసు అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాస సముదాయాలు 72 శాతం, ఎన్జీవోల భవంతులు 62 శాతం, గెజిటెడ్ అధికారుల క్వార్టర్లు 65 శాతంమేర చంద్రబాబు హయాంలోనే పూర్తయ్యాయి. కాని, జగన్ రాక్షస పాలనలో ఐదేళ్లు నిరాదరణకు గురైన భవంతుల పరిస్థితి ఏమిటనేది పరిశీలించాల్సి ఉంది. వర్షాల కారణంగా నీటిలో నానుతున్న నిర్మాణాల పటిష్టతను సాంకేతిక నిపుణులతో అంచనా వేయించాలి. తరువాతగానీ తదుపరి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండకపోవచ్చు. రాజధాని ప్రాంత పరిశీలన అనంతరం.. అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించిన తరువాత -ప్రభుత్వం ఎలాంటి చర్యలకు సన్నదమవుతుందో చూడాలి. అమరా వతి యథాస్థితి, తదుపరి కర్తవ్య నిర్వహణకు కేబినెట్ సబ్ కమిటీ అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటై తే, ఆ కమిటీ సమర్పించే సమగ్ర నివేదికను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించాలి. ఆ తరువాతే సవరించిన అంచనాలతో పనులు మొదలుపెట్టి.. నిర్దేశిత సమయంలో నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేయాలి. గుత్తేదారులకు పెండింగ్ బిల్లుల చెల్లింపు, మొబిలైజేషన్ అడ్వాన్సులు, గడువు పొడిగింపు, ప్రస్తుత కాంట్రాక్టర్లకే పనులు అప్పగించాలా? లేక మళ్లీ టెండర్లు పిలవాలా? అన్న అంశాలన్నీ ముఖ్యమంత్రి నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. సాఫీగా సాగిపోయే రాజధాని వ్యవహారంలో ఇంత సంక్లిష్టత కావడానికి కారణం వైసీపీ నిర్లక్ష్యమే.

## చక్కబెట్టాల్సిన అంశాలివీ..

అమరావతిలో అత్యంత కీలకమైన సీడ్ యాక్సెస్ రోడ్డు, మిగిలిన అనుసంధాన రహదారులను చక్కదిద్దడంతోపాటు, రాజధానిని రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు జాతీయ, రాష్ట్ర రహదారులతో అనుసంధానించాల్సి ఉంది. అలాగే, రాజధానిపై వైసీపీ సర్కారు చూపించిన నిర్లక్ష్యం కారణంగా.. ఎన్ఐడీ, ఎస్ఆర్ఎం, విట్‌లాంటి ప్రతి ష్టాత్మక సంస్థలకు మౌలిక సదుపాయాలు కల్పించ లేదు. వీటిని పరిష్కరిస్తే,మరిన్ని సంస్థలు అమరావతికి వరుస కడతాయనడంలో సందేహం లేదు. రాజధాని లో భూములు కేటాయించిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు వెంటనే పనులు ప్రారంభించి నిర్దిష్ట కాలపరిమితితో కార్యకలాపాలు సాగించే లా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ సంస్థ లకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తూనే, భవిష్యత్తు తాగునీటి అవసరాలకు వైకుంఠపురం వద్ద రిజర్వాయర్ నిర్మించాల్సి ఉంది. క్రైసిస్ మేనేజ్ మెంట్‌లో నిష్ణాతులైన ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు రాజధానిని పరిశీలించిన తరువాత ఎలాంటి నిర్ణయాలు ప్రకటిస్తారోనన్న ఆసక్తి సర్వత్రా ఉంది. రాష్ట్ర ప్రతిష్టను ఇనుమడింపచేసే ప్రజా రాజధాని అమరావతి - ఆంధ్ర ప్రజల ఆకాంక్ష మేరకే ఆవిష్కృతమవ్వాలని ఆశిద్దాం. జయహో.. అమరావతి!

ఐదేళ్ల తరువాత.. అధికారిక హోదాలో..

### రాజధాని నిర్మాణాలు పరిశీలించనున్న సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, సర్వతోముఖాభివృద్ధికి నిలువుటద్దమైన ప్రజా రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించనున్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తరువాత.. ప్రతిష్టాత్మక నిర్మాణం పోలవరాన్ని సందర్శించిన చంద్రబాబు, మలి పర్యటనగా నేడు రాజధాని ప్రాంతంలో పర్యటించి నిర్మాణాల స్థితిగతులను పరిశీలించనున్నారు. గురువారం తన నివాసం నుంచి ఉదయం 11 గంటలకు బయలుదేరనున్న చంద్రబాబు, ఉండవల్లిలో నాటి ప్రభుత్వం కూల్చిన ప్రజావేదిక నుంచే పర్యటన ప్రారంభించనున్నారు. ఉద్దండరాయునిపాలెంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధానికి శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని సందర్శిస్తారు. అక్కడి నుంచి సీడ్ యాక్సిస్ రోడ్, అఖిల భారత అధికారులు, మంత్రులు, న్యాయమూర్తుల గృహ సముదాయాలు, ఇతర నిర్మాణాలను పరిశీలిస్తారు. ఐకానిక్ భవనాల నిర్మాణాల కోసం నాడు పనులు మొదలు పెట్టిన సైట్‌లనూ సీఎం చంద్రబాబు పరిశీలించనున్నారు. పర్యటన అనంతరం రాజధాని స్థితిగతులపై చంద్రబాబు మీడియాతో మాట్లాడతారు.







# 'ప్రజాదర్బార్'కు జనం బారులు!



## ప్రత్యేక యంత్రాంగంతో సమస్యల పరిష్కారానికి లోకేష్ కృషి

అమరావతి (చైతన్యరథం): వైసీపీ పాలనలో అన్ని విధాల నష్టపోయి సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న ప్రజలు యువనేత లోకేష్ ప్రారంభించిన 'ప్రజాదర్బార్'కు పోటెత్తుతున్నారు. మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌ను నేరుగా కలిసి తమ సమస్యలు విన్నవించుకునేందుకు ఉండవల్లి నివాసంలో వేకువజాము నుంచే ప్రజలు పెద్దఎత్తున బారులు తీరుతున్నారు. లోకేష్ వద్దకు వెళితే తమకు పరిష్కారం లభిస్తుందన్న నమ్మకంతో మంగళగిరి ప్రజలు ఆయనను కలిసి సమస్యలు విన్నవిస్తున్నారు. బుధవారం నాడు నిర్వహించిన ప్రజాదర్బార్‌కు నియోజకవర్గం నుంచే కాకుండా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రతిఒక్కరి సమస్యను ఓపిగ్గా వింటున్న లోకేష్.. యంత్రాంగం ద్వారా ఆయా శాఖలకు రిఫర్ చేసి పరిష్కారం చూపుతున్నారు. తన కుమార్తెకు వికలాంగ పెన్షన్ మంజూరుచేయాలని మంగళగిరికి చెందిన కే శ్రీలక్ష్మి కోరారు. భర్త చనిపోయిన నలుగురు పిల్లలు ఉన్న తనకు జీవనాధారం కల్పించడంతో పాటు ఇంటిని మంజూరు చేయాలని సీతానగరానికి చెందిన కే కనకదుర్గ విజ్ఞప్తి చేశారు.

మానసిక వికలాంగురాలైన తన కుమార్తెకు గత వైసీపీ ప్రభుత్వం ఫించను నిలిపివేసిందని, తిరిగి పునరుద్ధరించాలని తాడేపల్లికి చెందిన షేక్ సుల్తాన్ వలి విన్నవించారు. రాజధాని రైతులకు ఇచ్చే పెన్షన్‌ను గత ప్రభుత్వం నిలిపివేసిందని, తిరిగి మంజూరు చేయాలని నవులూరుకు చెందిన రైతు వేమూరి విజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. డిగ్రీ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని మంగళగిరికి చెందిన షేక్ రెహ్మాన్ కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమార్తెకు వైద్యసాయం అందించాలని దుగ్గిరాలకు చెందిన బి.శాంతరాజు, ఎలాంటి ఆధారం లేని తనకు ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన ఎన్.మాధవి వినతిపత్రం అందజేశారు. మహాత్మా జ్యోతిబా పూలే బీసీ డబ్ల్యూఆర్ స్కూల్, కాలేజీల్లో పనిచేస్తున్న పార్ట్ టైం సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని సిబ్బంది కోరారు. వైసీపీ ప్రభుత్వం తొలగించిన 1800 మంది బీమా మిత్రలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆ సంఘం ప్రతినిధులు విన్నవించారు. రాష్ట్రంలోని ఎయిడెడ్ కళాశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి కనీస వేతనం అమలు చేయాలని ఏపీఏసీటీపీఎల్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులను రెగ్యులరైజ్ చేయాలని ఏపీఎన్ఎస్ కమిటీ విజ్ఞప్తి చేసింది. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఆయా సమస్యలను పరిష్కరిస్తానని యువనేత హామీ ఇచ్చారు.

























### గంటలో సమస్య తీరింది

మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్న ప్రజా దర్బారుకు విశేష స్పందన లభిస్తోంది. మంత్రిని కలిశాక తమ సమస్యను వెంటనే పరిష్కరించారని విశాఖ నగరానికి చెందిన మహిళ తెలిపారు. విశాఖకు చెందిన అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు దేవకీదేవి ఎగ్జిబిషన్ గడువు పెంపు కోసం గత కొన్ని రోజులుగా విశాఖలో ఉన్నతాధికారుల చుట్టూ తిరిగారు. తాము తయారు చేసుకున్న చేతివృత్తుల ఉత్పత్తుల అమ్మకం కోసం అధికారులను గడువు కోరినా ఫలితం దక్కలేదని ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం మంత్రి లోకేష్‌ను కలిశాక గంటలో సమస్య తీరిపోయిందంటూ దేవకీదేవి భావోద్వేగానికి గురై కన్నీటిపర్యంతమయ్యారు. పారా మెడికల్, ఆర్ఎంపీ, కేజీబీవీ సంఘాల సమస్యలను విని వాటి పరిష్కారానికి లోకేష్ హామీ ఇచ్చారు. మిగతా జిల్లాల్లోని నేతలు కూడా ప్రజాదర్బార్ నిర్వహిస్తే దూర ప్రాంతాల నుంచి అమరావతికి వచ్చే సమస్య ఉండదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# డిప్యూటీ సీఎంగా పవన్ బాధ్యతల స్వీకరణ

- ఉపాధి హామీ పథకాన్ని ఉద్యాన పంటల పనులకు అనుసంధానించే ఫైల్‌పై తొలి సంతకం
- గిరిజన గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణం ఫైలుపై మలి సంతకం

అమరావతి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బుధవారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

డిప్యూటీ సీఎం హోదాలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రిగానూ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన పవన్‌కు అధికారులు, ఎమ్మెల్యేలు అభినందనలు తెలిపారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, తదితరులు పవన్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

అనంతరం ఉపాధి హామీ పథకాన్ని ఉద్యాన వన సంబంధిత పనులకు అనుసంధానించి నిధుల మంజూరుపై తొలి సంతకం చేశారు. ఆ తర్వాత గిరిజన గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణంపై రెండో సంతకం చేశారు.

బాధ్యతల స్వీకరణ అనంతరం ఐఏఎస్ అధికారులతో ఉప ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పలు కీలక అంశాలపై చర్చించారు. గ్రామాలలో మౌలిక వసతులు, రోడ్ల నిర్మాణం, మంచినీటి ఎద్దడి నివారణ వంటి అంశాలపై ఐఏఎస్ అధికారులకు పవన్ కల్యాణ్ పలు సూచనలు చేశారు. ప్రణాళికలు సిద్ధం చేసి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మూడు నెలల తర్వాత పనుల పురోగతిపై పునఃసమీక్ష చేస్తానన్నారు. ఈ మూడు నెలల కాలంలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించవద్దని అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హితవు పలికారు.



# పోలీసులు ప్రజలకోసం పనిచేయాలి

## స్పష్టం చేసిన హోంమంత్రి అనిత

- ప్రత్యేక పూజల అనంతరం బాధ్యతల స్వీకరణ
- శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నేతలు, ఉన్నతాధికారులు
- గత ప్రభుత్వ ఆలోచనలున్న పోలీసులు పక్కకు తప్పుకోవాలని సూచన
- దిశ పోలీస్ స్టేషన్ల పేరును మారుస్తామని వెల్లడి
- సోషల్ మీడియాలో రెచ్చిపోతే కఠిన చర్యలుంటాయని హెచ్చరిక

అమరావతి:ఆంధ్రప్రదేశ్ హోంమంత్రిగా వంగలపూడి అనిత బాధ్యతలను స్వీకరించారు. సచివాలయంలోని బ్లాక్-2లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బుధవారం ఆమె బాధ్యతలను స్వీకరించారు. ఆమెకు వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఇక హోం



మంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో అనితను పార్టీ నేతలతో పాటు ఉన్నతాధికారులు కలసి అభినందనలు తెలిపారు. బొకేలను అందించి ఆమెకు శుభాకాంక్షలను చెప్పారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో ఒక మహిళ హోం మంత్రిగా బాధ్యతలను స్వీకరించడం ఇదే తొలిసారి. ఆమెతో పాటు కుటుంబ సభ్యులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

అనంతరం అనిత మాట్లాడుతూ ఏపీ ప్రజలు, అధినేత చంద్రబాబు ఆశీస్సులతో బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు. తనను ఆశీర్వదించిన పాయకరావుపేట ప్రజలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు.

పోలీసుల్లో గత ప్రభుత్వ ఆలోచనలు ఉన్నవారు పక్కకు తప్పుకోవాలని సూచించారు. పోలీసులు ప్రజలకు అనుకూలంగా పని చేయాలన్నారు. ఇంతకుముందులాగే ప్రవర్తిస్తామనే పోలీసులు వాళ్లంతట వాళ్లే తప్పుకోవాలన్నారు. వారు పక్కకు తప్పుకుంటే పనిచేసేవారు వస్తారు. చంద్రబాబు కోసమో...పవన్‌కల్యాణ్ కోసమో...ఎన్డీయే కోసమో పని చేయమని చెప్పడం లేదు. ప్రజల కోసం పని చేయాలని చెబుతున్నామన్నారు. దిశ పోలీస్‌స్టేషన్ల పేరును మారుస్తామన్నారు. సోషల్ మీడియాలో మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వంద రోజుల్లో గంజాయి, డ్రగ్స్ రవాణా చాలా మేరకు తగ్గిస్తామని ఆమె హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో పెట్టిన అక్రమ కేసులపై విచారణ జరిపిస్తామన్నారు. బాధితులు కేసులు రీ ఓపెన్ చేయాలని కోరితే తప్పకుండా చేస్తామన్నారు.

# జగన్ అసెంబ్లీకి రావాలి: పయ్యావుల

- అభివృద్ధి, సంక్షేమంపై అర్థవంతమైన చర్చ జరగాలని ఆకాంక్ష
- చంద్రబాబు సారథ్యంలో పారదర్శక పాలన అందిస్తామని హామీ



అమరావతి: మాజీ ముఖ్యమంత్రి జగన్ అసెంబ్లీకి రావాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. బుధవారం ఆయన అసెంబ్లీలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ... శాసనసభ సమావేశాల్లో రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి సంబంధించి అర్థవంతమైన చర్చలుజరగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన పారదర్శక పాలన అందించేందుకు కృషి చేస్తామన్నారు. జగన్ సభకు వచ్చి... ప్రజా సమస్యలపై మాట్లాడాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. ఇప్పుడు సభలో స్వపక్షమైనా...విపక్షమైనా తామే అన్నారు. ప్రజలకోసం ఏపాత్ర పోషించ డానికైనా సిద్ధంగా ఉంటామ న్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో అసెంబ్లీ నిర్వహణ నేపథ్యంలో ఇందుకు సంబంధించిన దస్త్రాలపై కేశవ్ సంతకాలు చేశారు. అనంతరం సమావేశాల నిర్వహణ, తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు.

### రుషికొండ భవనాల వినియోగంపై

# చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారు

## కచ్చితంగా ఉపయోగించుకుంటా మని చెప్పిన మంత్రి డోలా

ప్రకాశం: విశాఖలోని రుషికొండపై నిర్మించిన భవనాలను ఎన్డీయే ప్రభుత్వం కచ్చితంగా ఉపయోగించుకుంటుందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. భవనాలను ఏ విధంగా ఉపయోగించాలనే దానిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారని మంత్రి చెప్పారు.

గత ప్రభుత్వం మాదిరిగా తాము ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయబోమన్నారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వం అమరావతిలో ప్రజా వేదికను కూల్చివేయడాన్ని గుర్తు చేశారు. అలాంటి పనులు ఎప్పటికీ తమ అధినేత చేయరన్నారు. ప్రభుత్వ డబ్బు వృథా కానివ్వమని, నష్టం కలిగించేలా




వ్యవహరించబోమని వెల్లడించారు. ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యేలు ఆ పార్టీలో నిలబడలేకపోతున్నారని, వారు ఎవరెవరితో టచ్‌లో ఉన్నారనే విషయాన్ని మాత్రం చెప్పనన్నారు.

# గృహనిర్మాణ నిధులు దారి మళ్లించిన వైసీపీ ప్రభుత్వం

## జగనన్న కాలనీల్లో మొత్తం కేంద్ర నిధులే: మంత్రి పార్థసారథి

అమరావతి: జగన్ ప్రభుత్వంలో పథకాలన్నీ నేతి బీరకాయ తరహాలోనే అమలయ్యాయని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అమరావతిలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకాపా ప్రభుత్వంలో 26 లక్షల ఇళ్లలో కేవలం 6 లక్షలు మాత్రమే నిర్మించారని తెలిపారు. పేదలందరికీ ఇళ్లు అని చెప్పి సగం సగం పనులు చేశారని విమర్శించారు. గడిచిన ఐదేళ్లలో గృహ నిర్మాణంలో రాష్ట్రం చివరి స్థానంలో నిలిచిందన్నారు. వైసీపీ ప్రభుత్వం యూనిట్ ధరను కూడా తగ్గించింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.2 లక్షలు నుంచి 2.50 వేలు వుంటే దానిని వైసీపీ ప్రభుత్వం రూ.1.80 వేలకు తగ్గించిందన్నారు. లబ్ధిదారులకు రూ.945 కోట్ల మేర బిల్లులను ఎగ్గొట్టారు. గృహ నిర్మాణ శాఖకు ఇవ్వాల్సిన రూ.3,070 కోట్ల మేర నిధులు కూడా గత ప్రభుత్వం మళ్లించింది. మళ్లించిన నిధులు దేనికి వాడారన్నది ప్రస్తుతం ప్రశ్నగా మిగిలింది. ఆ నిధులు రుషికొండ ప్యాలెసుకు మళ్లించారా? లేదా ఇతర అంశాలకా.. అన్నది తేలుస్తాం. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేసే బాధ్యత టీడీపీ ప్రభుత్వం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు దారి మళ్లించడంతో పాటు రాష్ట్ర వాటాగా ఇవ్వాల్సిన నిధులు సైతం గత ప్రభుత్వం ఇవ్వలేదు. గడిచిన ఐదేళ్లలో పశ్చిమ బెంగాల్లో 45 లక్షల ఇళ్లు నిర్మించారు. ఏపీలో కేవలం 6.08 లక్షల ఇళ్లు మాత్రమే కట్టగలిగారు. లే అవుట్లలో సదుపాయాల కొరత ఉంది. భూమి కేటాయించినప్పుడు నిర్మాణాలకు అనువుగా వుందా లేదా అన్నది చూడలేదని, డిపార్టుమెంట్‌లో ఏ అవకతవకలు జరిగినా విచారణ చేయిస్తామని మంత్రి స్పష్టం చేశారు.




జగనన్న కాలనీ పేరు మార్పుపై చర్చిస్తామన్నారు. గత ప్రభుత్వం లబ్ధిదారుల పేరిట రుణాలు తీసుకుంది. జగనన్న కాలనీల్లోనూ రాష్ట్ర వాటా నిధుల్లేవు.. అన్నీ కేంద్రానివే అని కొలుసు పార్థసారథి తెలిపారు.

# 24న కేబినెట్ భేటీ

అమరావతి: ఏపీ మంత్రివర్గ సమావేశం ఈనెల 24న జరగనుంది. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్ష తన ఉదయం 10 గంటలకు ఈ భేటీ నిర్వహించనున్నారు. కేబినెట్ సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై ప్రతి పాదనలు పంపాలని అన్ని ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు వెళ్లాయి.

21వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత జరగనున్న తొలి మంత్రివర్గ సమావేశం ఇదే.

# ప్రభుత్వ జీతం.. పార్టీ పని!

- వేలసంఖ్యలో పొరుగు సేవల ఉద్యోగులుగా వైసీపీ కార్యకర్తలు
- ఆఫీసుకు వెళ్లకుండానే వేతనాలు చెల్లింపు
- సర్కారీ సొమ్ము అడ్డగోలుగా స్వాహా
- ఒక్కొక్కటిగా బయట పడుతున్న అక్రమాలు

అమరావతి, చైతన్యరథం: బరితెగించిన పాలన కారణంగా ప్రజలిచ్చిన తీర్పుతో చావుదెబ్బతిన్న వైసీపీ, ఆ పార్టీ అధినేత జగన్‌రెడ్డి.. అధికారంలో ఉన్నప్పుడు చేసిన పాపాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. సర్కారీ సొమ్మును అడ్డగోలుగా స్వాహా చేసిన వైనాలు వెలుగులోకి వస్తున్నాయి. పొరుగు సేవల ఉద్యోగుల నియామకాల్లోనూ అప్పటి వైసీపీ ప్రభుత్వం భారీ కుంభకోణానికి పాల్పడింది. గత ఐదేళ్లలో వివిధ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లలో పొరుగు సేవల ఉద్యోగులుగా వేలసంఖ్యలో వైసీపీ కార్యకర్తలను నియమించారు. ఈ ప్రగతి, రియల్ టైమ్ గవర్నెన్స్, ఏపీ డిజిటల్ కార్పొరేషన్, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్‌తోపాటు వివిధ కార్పొరేషన్లలో పొరుగుల సేవల విభాగంలో అధిక వేతనాలతో వైసీపీ కార్యకర్తలను ఉద్యోగులుగా నియమించారు. వీరంతా ఆయా కార్పొరేషన్ల మొహం చూసింది లేదు. అక్కడికి వెళ్లి డ్యూటీ చేసింది లేదు. మామూలుగా ఎవరి ఊళ్లల్లో వారుండి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ సొంత పనులు చూసుకునేవారు. కానీ వీరికి నెల తిరిగే సరికి ఠంచన్‌గా ఆ కార్పొరేషన్ నుండి జీతాలు వెళ్లిపోయేవి. ఎక్కడెక్కడో దూర ప్రాంతాల్లో ఉన్న వారికి కూడా వేతనాలు వెళ్లాయి. వారు ఆ కార్పొరేషన్‌లో పనిచేసే పొరుగు సేవల ఉద్యోగులని అక్కడ పని చేస్తున్న రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులెవ్వరికీ తెలియదు. కానీ జీతాలు మాత్రం లక్షల్లో చెల్లించేవారు. ప్రభుత్వం మారిన తర్వాత ఇప్పుడు ఒక్కొక్కటిగా అన్ని విషయాలు బయటకు వస్తున్నాయి. దీంతో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏపి శాఖలో, ఏపి కార్పొరేషన్‌లో పొరుగు సేవల ఉద్యోగులు ఉన్నారు... వారంతా ఎలా పని చేశారు... వీరిలో విధులకు రాకుండా వైసీపీ పార్టీ కార్య కర్తల్లా పనిచేసిన వారు ఎవరు, వారికి ఎంత మేరకు చెల్లింపుల చేశారనే దానిపై నివేదికలు తయారు చేస్తోంది. ఇన్ని రోజులు భయపడిన ఆయా కార్పొరేషన్లలోని రెగ్యులర్ ఉద్యోగులు ఇప్పుడు ధైర్యంగా బయటకు వచ్చి ఎక్కడెక్కడ తప్పులు జరిగాయో కొత్త ప్రభుత్వానికి సమాచారమిస్తున్నారు.

### జీతం నైపుణ్యాభివృద్ధి సంస్థలో... పని వైసీపీ సోషల్ మీడియా విభాగంలో...

జగన్‌రెడ్డి తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు, ప్రతిపక్షంపై బురద చల్లేందుకు పెద్ద ఎత్తున సోషల్ మీడియా విభాగాన్ని నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ విభాగంలో వందల సంఖ్యలో పార్టీ కార్యకర్తలు వైసీపీ కోసం పని చేశారు. అయితే వీరికి జగన్‌రెడ్డి తన జేబులో నుండి డబ్బులు ఇవ్వకుండా ప్రభుత్వ కార్పొరేషన్ల నుండి జీతాలు ఇప్పించాడు. అంటే వీరు పొరుగు సేవల ఉద్యోగులుగా కార్పొరేషన్లలో పనిచేస్తూ వైసీపీ సోషల్ మీడియాకు పని చేశారు. వీరు ఆ కార్పొరేషన్‌లో డ్యూటీకి వెళ్లలేదు. జీతం మాత్రం తీసుకున్నారు. ఈ విధంగా ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థలో 76మంది వైసీపీ కార్యకర్తలు ఉన్నట్లు తేలింది. వీరంతా వైసీపీ సోషల్ మీడియాలో పని చేసిన వారే. వీరే కాకుండా ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లో పని చేసిన వందల మంది పొరుగు సేవల ఉద్యోగులు కూడా పేరుకు ఆ కార్పొరేషన్ నుండి జీతం తీసుకుంటూ వైసీపీ సోషల్ మీడియాకు పని చేశారు. ఇప్పుడు ఆ తీగ లాగితే డొంకంతా కదులుతోంది.

### హోంగార్డులుగా భారతీరెడ్డి ఇంటి పనిమనుషులు

అగ్నిమాపక శాఖలో హోంగార్డుల నియామకం లోనూ ఇదే తంతు నడిచింది. జగన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతీరెడ్డి ఇంట్లో పని మనుషులుగా చేసే వారిని.. ఎటువంటి నియమనిబంధనలు పాటించ కుండా, కనీస అర్హతలు కూడా చూడకుండా హోం గార్డులుగా నియమించారు. భారతీ రెడ్డితోపాటు కడప ఎంపీ అవినాష్‌రెడ్డి రికమండేషన్‌తో 71మందిని నేరు గా నియమించారు. సాధారణంగా వీరిని ఉద్యోగాల్లోకి తీసుకోవాలంటే నోటిఫికేషన్ ఇవ్వాలి. కనీసం పదో తరగతి పాసై ఉండాలి. దేహధారుఢ్య పరీక్షలు నిర్వ హించాలి. హెవీవెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. కానీ ఇవేవీ పట్టించుకోకుండానే ఉద్యోగాలు ఇచ్చేశారు. అలాగే ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిలోనూ నిబంధనలకు విరుద్ధంగా పొరుగు సేవల విభాగంలో 150 మందిని ఎంపీ అవినాష్‌రెడ్డి రికమండేషన్‌తో నింపేశారు. వీరి లో వంద మంది పులివెందులకు చెందిన వైసీపీ కార్యకర్తలు ఉన్నారు. ఒకే ఇంట్లో ముగ్గురికి, నలుగు రికి కూడా ఉద్యోగాలు ఇచ్చారు. వీరు చాలా మందికి డ్యూటీలకు వెళ్లడం లేదు. కానీ జీతాలు మాత్రం తీసుకుంటారు.

### పెద్దిరెడ్డి అడ్డాగా ఏపీఎండీసీ

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గనుల శాఖా మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)ని తన జేబు సంస్థలా మార్చేశారు.. వైసీపీ నేతలు, కార్యకర్తలను పొరుగు సేవల ఉద్యోగులుగా సంస్థలోకి చొప్పించారు. 2019లో ఈ సంస్థలో పొరుగు సేవల విభాగంలో 50 మంది ఉద్యోగులు మాత్రమే ఉండగా ఆ సంఖ్యను పెద్దిరెడ్డి 400కు పెంచారు. అందులో 90 శాతం మంది ఉద్యోగులను చిత్తూరు, తిరుపతి జిల్లాల నుండి నింపేశారు. ఇంటర్మీయట్ చదివిన వారికి మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్ల పోస్టులు అప్పగించి వేలకు వేలు జీతాలు ఇచ్చారు. వీరెవ్వరూ కూడా సంస్థకు వచ్చి ఉద్యోగాలు చేసింది లేదు. రోజువారీ వైసీపీ పార్టీ కార్యక్రమాల్లో నిమగ్నమైఉండేవారు. వీరిలో కొంతమంది పెద్దిరెడ్డి, ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి ఇళ్లల్లో సహాయకులుగా పని చేసేవారు. ఇలా తమ అధికారాన్ని దుర్వినియోగం చేసి ప్రజల సొమ్మును అడ్డంగా దోచుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగం పేరుతో పార్టీ సేవకు ఉపయోగించుకున్నారు. పైన పేర్కొన్నవే కాక చాలా శాఖల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పుడు అవన్నీ బయటకు వస్తున్నాయి.

## రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ జెస్సీ రాజ్‌కు లోకేష్ అభినందనలు



అమరావతి (చైతన్యరథం): న్యూజిలాండ్‌లో ఇటీవల జరిగిన ప్రపంచ ఓషియానిక్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన విజయవాడకు చెందిన మాత్రపు జెస్సీ రాజ్ అత్యున్నత ప్రదర్శన ద్వారా అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం హర్షణీయమని రాష్ట్ర మానవ వనరులు,ఐటీ,ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అభినందనలు తెలియజేశారు. ఇన్ స్కేటింగ్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించిన జెస్సీరాజ్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. మన విజయవాడకు చెందిన బాలిక ప్రపంచస్థాయిలో భారత్ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప జేయడం గర్వంగా ఉందన్నారు. జెస్సీ రాజ్ లాంటి ప్రతిభగల క్రీడాకారిణిలకు తమ ప్రభుత్వం అన్నివిధాలా సహాయ, సహకారాలను అందించి ప్రోత్సహిస్తుందని స్పష్టం చేశారు.

## ఏజీగా దమ్మాలపాటి ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



అమరావతి: ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్ జనరల్‌గా దమ్మాలపాటి శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం జీవో జారీ చేసింది. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి సత్యప్రభాకర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. దమ్మాలపాటి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఉత్తర్వులు అమలులోకి వస్తాయని ఆదేశాలు జారీ చేశారు.గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దమ్మాలపాటి 2014 జూన్ 30 నుంచి 2016 మే వరకు అదనపు అడ్వకేట్ జనరల్(ఏఏజీ)గా సేవలు అందించారు. 2014 జూన్ నుంచి ఏజీగా వ్యవహరించిన సీనియర్ న్యాయవాది పి.వేణుగోపాల్ తన పదవికి రాజీనామా చేయడంతో 2016 మే 28న దమ్మాలపాటిని ప్రభుత్వం ఏజీగా నియమించింది. అప్పటి నుంచి వైసీపీ ప్రభుత్వం వచ్చే వరకు ఆయన సేవలు అందించారు. ఈ అనుభవమే ప్రస్తుతం ఆయన రెండోసారి ఏజీగా నియమితులయ్యేందుకు దోహదపడింది. గురువారం ఆయన బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. 2019లో జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత దమ్మాలపాటిపై క్రిమినల్ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టారు. వాటన్నిటినీ ఆయన సమర్థంగా ఎదుర్కొన్నారు. చంద్రబాబును అరెస్టు చేసి జైలులో ఉంచిన సందర్భంలో ఏసీబీ కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో జరిపిన న్యాయపోరాటంలో దమ్మాలపాటి కీలకపాత్ర పోషించారు.

## రుషికొండ నిర్మాణాలపై తడవకో మాట..
## రోజాని విచారిస్తే నిజాలన్నీ బయటకొస్తాయన్న బుద్ధా వెంకన్న

అమరావతి: రుషికొండ నిర్మాణాలపై మాజీ మంత్రి, వైసీపీ నేత రోజా చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నేత బుద్దా వెంకన్న ఎక్స్ వేదికగా బుధవారం కౌంటర్ ఇచ్చారు. 'ఏంటమ్మా రోజా' అంటూ ట్వీట్‌ను ప్రారంభించారు. నాడు రుషికొండ నిర్మాణాలు ముఖ్యమంత్రి నివాసం కోసమని, అక్కడి నుంచే పాలన అని చెప్పి... ఈ రోజు పర్యాటకుల కోసం నిర్మించామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. రోజాను విచారిస్తే అసలు నిజాలు బయటకు వస్తాయన్నారు. నాడు ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ కథ ఏమిటో కూడా బయటకు వస్తుందన్నారు.



అమరావతిలో వర్షానికి కారిపోయే భవనాలను నాడు చంద్రబాబు నిర్మించారని ఆరోపణలు చేస్తున్నారని... మరి అలాంటి భవనాల్లో ఐదేళ్లు ఉండి ఎలా పాలన చేశారో చెప్పాలన్నారు. రుషికొండలో అత్యంత నాణ్యతతో నిర్మించిన భవనాలు ఎవరి కోసం? అని నిలదీశారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత రోజాకు మతిచెడినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. రుషికొండ నిర్మాణాలపై ఒక్కోసారి ఒక్కో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రపతి కోసమని ఒకసారి... ప్రభుత్వానివి అని మరోసారి చెబుతున్నారని మండిపడ్డారు. అసలు రుషికొండకు బోడిగుండు చేయమని ఎవరు చెప్పారని నిలదీశారు. చేయాల్సిందంతా చేసి ఇప్పుడు నీతులు చెబుతున్నారని విమర్శించారు. వైసీపీ నేతల కబుర్లు దొరికితే దొంగ లేకుంటే దొర అన్నట్లుగా ఉందన్నారు. ప్రజల సొమ్ముతో సోకులు చేసుకోవడానికి సిద్ధమైన మీకు (వైసీపీ) ఆ ప్రజలే బుద్ధి చెప్పారన్నారు.

రుషికొండలో నిర్మించింది పర్యాటక భవనాలు అని రోజా మంగళవారం వెల్లడించారు. దీంతో అంతకుముందు సీఎం నివాసం కోసమని చెప్పి... ఇప్పుడు పర్యాటక భవనాలు అంటున్నారేమిటని బుద్దా వెంకన్న ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

## జగన్ అవినీతి, నిర్లక్ష్యం వల్లే పోలవరంపై అనిశ్చితి

*- మాజీమంత్రి దేవినేని ధ్వజం*



అమరావతి: గత ముఖ్యమంత్రి జగన్ అవినీతి, నిర్లక్ష్యం వల్లే పోలవరం ప్రాజెక్టు అనిశ్చితిలోకి వెళ్లిందని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. వైసీపీ హయాంలో పనిచేసిన మంత్రులు తమకు అసలు ప్రాజెక్టు కట్టే తీరే అర్థం కాలేదని చెప్పడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఐదేళ్లలో ఎలాంటి పురోగతి లేకపోగా... కనీసం రక్షణ చర్యలు కూడా తీసుకోకుండా కట్టిన నిర్మాణాలను కూడా ధ్వంసం చేశారని మండిపడ్డారు. 2020లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతింటే నాలుగేళ్లుగా దానిపై ఎందుకు నిర్ణయం తీసుకోలేదని ప్రశ్నించారు. పోలవరం పూర్తి చేస్తామని గతంలో అసెంబ్లీలో ముఖ్యమంత్రి, మంత్రులు మాట్లాడిన మాటలకు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. కమీషన్ల కోసం కక్కుర్తిపడి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రివర్స్ టెండరింగ్ నాటకమాడారని ఆరోపించారు. ప్రజా శ్రేయస్సు గురించి ఆయన పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. జగన్ అసెంబ్లీలో మాట్లాడిన వీడియోను దేవినేని ఉమామహేశ్వరరావు తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు.

## ఫెర్రర్‌కు లోకేష్ నివాళి



అమరావతి: మానవతామూర్తి, ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్‌ఫెర్రర్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి రాష్ట్ర ఐటీ, హెచ్ఆర్డీ శాఖల మంత్రి నారా లోకేష్ ఘనంగా నివాళులర్పించారు. నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడు ఫెర్రర్ స్ఫూర్తిగా ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని పిలుపు ఇచ్చారు.

# పోలవరం పాపం నీదే కదా జగన్‌రెడ్డి!

## ఈ ప్రశ్నలకు జవాబు చెప్పే దమ్ముందా?



అమరావతి, చైతన్యరథం: ఏపీ రాష్ట్ర ప్రజల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్ట్‌ను జగన్‌రెడ్డి తన మూర్ఖత్వపు ఆలోచనలతో, అహంకారంతో అస్తవ్యస్తం చేశారు. 2020 నాటికే పూర్తికావాల్సిన ప్రాజెక్ట్‌ను మరో ఎనిమిదేళ్లు వెనక్కి నెట్టారు. దీన్ని గమనించి ప్రజలు చెప్పుతో కొట్టినట్లు తీర్పు ఇచ్చినప్పటికీ ఆత్మ విమర్శ చేసుకోకుండా తన అవినీతిపత్రిక 'సాక్షి' ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబుపై అభాండాలు వేస్తున్నారు. పోలవరం నిర్మాణం కోసం అహర్నిశలు శ్రమించి ఐదేళ్ల కాలంలోనే 72 శాతం పనులను పూర్తి చేసిన చంద్రబాబు వల్లే ప్రాజెక్ట్ కుదేలైనట్లు ఆరోపణలు చేస్తున్నారు. కానీ వాస్తవాలను ప్రజలు గమనించలేని స్థితిలో లేరు. నిజంగా జగన్‌రెడ్డికి దమ్ముంటే ఈ కింది ప్రశ్నలకు జవాబు చెప్పాలి.

1. చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో పునాది రాయితో ప్రారంభించి 72 శాతం పనులు పూర్తి చేశారు. కానీ నీ పాలనా కాలంలో కేవలం నాలుగు శాతం పనులనే పూర్తి చేయగలిగారు. మిగిలిపోయిన 28 శాతం పై..పై పనులు పూర్తి చేయడానికి ఐదేళ్ల సమయం సరిపోలేదా జగన్‌రెడ్డి? అయినా 72 శాతం పనులెక్కడా...నాలుగు శాతం పనులెక్కడా...ఇంకా ఎదుటివారిని నిందించడానికి నోరెలా వస్తుంది నీకు?
2. 2014-19 మధ్య చంద్రబాబు పాలనా కాలంలో డయాఫ్రం వాల్ పూర్తయింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు 90 శాతం పూర్తయ్యాయి. ఏకకాలంలో డయాఫ్రం వాల్, కాఫర్ డ్యామ్‌లు, స్పిల్ వే, అప్రోచ్ చానల్ పనులు జరిగాయి. స్పిల్ వేపై బిగించడానికి 48 రేడియల్ గేట్లు సిద్ధంగా ఉన్నాయి. స్పిల్ వే, అప్రోచ్ చానల్ పనులు 70 శాతం వరకు పూర్తయ్యాయి. ఇక డయాఫ్రం వాల్ పైన ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మించే పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇంత పని పూర్తయిన తర్వాత మిగిలిన పని ఒక ఏదాది కాలంలో పూర్తయి ఉండేది. కానీ ఐదేళ్లు గడిచినా ఎందుకు చేయలేకపోయావు జగన్‌రెడ్డి? ఇది పూర్తిగా నీ అహంకారం, మూర్ఖత్వంతో చేసిన నిర్ణయాల ఫలితం కాదా?
3. 2020తో పూర్తి కావాల్సిన ప్రాజెక్ట్. 2019 సీజన్ నాటికే పూర్తికావాల్సిన ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు. కానీ రివర్స్ టెండరింగ్‌కు వెళ్లాలన్న మూర్ఖత్వపు చర్య కారణంగా 2019 సీజన్‌లో జూన్ నుండి పనులు ఆగిపోయిన మాట వాస్తవం కాదా? నీవు కాంట్రాక్టర్‌ను మార్చకుండా ఉంటే 2019లో వరదలు వచ్చే సమయానికల్లా కాఫర్ డ్యామ్ పూర్తయ్యేది కదా? కాఫర్ డ్యామ్ పూర్తయి ఉంటే డయాఫ్రమ్ వాల్ దెబ్బతినేది కాదు..దీంతో 2020 నాటికే ప్రాజెక్ట్ పూర్తయ్యేది కదా? నీ మూర్ఖత్వపు చర్యలు కారణంగా వరదల్లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ఆ తర్వాత కాఫర్ డ్యామ్‌లకూ సీపేజ్‌లు ఏర్పడ్డాయి. గైడ్ బండ్ దెబ్బతింది. వరదలు వచ్చిన తర్వాత కూడా ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండని కారణంగా మరింత నష్టం జరిగింది వాస్తవం కాదా?
4. తప్పంతా నీ దగ్గర పెట్టుకొని దాన్ని కప్పిపుచ్చుకునేందుకు నీకు అలవాటైన అబద్ధాలను వల్లె వేస్తున్నావు. 2019లో గోదావరికి వరదలు ఆగస్టులో వస్తే జూన్‌లోనే వరదలు వచ్చాయని, అప్పటి కల్లా కాఫర్ డ్యామ్‌ను చంద్రబాబు పూర్తి చేయలేకపోయారని, అందువల్లే కిందనున్న డయాఫ్రంవాల్ దెబ్బతిన్నదని నీ విషపత్రిక సాక్షి ద్వారా అబద్ధాలు ప్రచారం చేస్తున్నావు. అబద్ధపు ప్రచారాలు నిన్ను కాపాడలేవని ఎన్నికల ఫలితాల తర్వాత కూడా నీకు అర్థం కాలేదా జగన్‌రెడ్డి?
5. రివర్స్ టెండరింగ్‌కు వెళ్లి 200 కోట్లు మిగిల్చానన్నాను. ఆ ప్రక్రియ కోసం పనులు ఆపడం వల్ల జరిగిన నష్టాన్ని పూడ్చడానికి రెండు వేల కోట్ల రూపాయలపైనే అవుతోందని నీవే కేంద్రానికి లేఖ రాశావు. నష్టాన్ని పూడ్చడానికి అదనపు నిధులు మాత్రమే కాక...ప్రాజెక్ట్‌ను సకాలంలో పూర్తి చేయలేక నిర్మాణ వ్యయం కూడా రెండింతలు పెరిగిపోయింది. ఇది నీ మూర్ఖత్వం వల్ల వచ్చిన నష్టం కాదా జగన్‌రెడ్డి?
6. ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అస్తవ్యస్తం చేయడమే కాక ప్రాజెక్ట్ ఎత్తును తగ్గించావు. 194 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 2020 నాటికే పూర్తి కావాల్సిన ప్రాజెక్ట్‌ను 115 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో మొదటి దశ నిర్మాణం అంటూ కొత్త రాగం అందుకున్నావు. అదీ కూడా పూర్తి చేయలేకపోయావు. ఇక నీకు చంద్రబాబును ఆడిపోసుకునే అర్హత ఎక్కడుంది జగన్‌రెడ్డి?
7. నీవు అధికారంలోకి వచ్చే నాటికి 1771 కోట్ల రూపాయల పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. రివర్స్ టెండరింగ్ పేరుతో సమర్థవంతంగా ప్రాజెక్ట్ కడతానంటూ రూ.1548 కోట్లకు కొత్తగా మెగా ఇంజనీరింగ్ సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చావు. వాళ్లు 2021 డిసెంబర్ నాటికి ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని హామీనిచ్చారు. కానీ 2024 వచ్చినప్పటికీ కూడా ప్రాజెక్ట్ పూర్తి కాకపోగా... అదనపు నష్టం జరిగింది. సమర్థవంతులను ఎంచుకునే సమర్థత నీదా...చంద్రబాబుదా జగన్‌రెడ్డి? ఇప్పటికే ప్రజలు నీ మొహంపై ఉమ్మేశారు. ఇంకా ఆకాశం మీద ఉమ్మేయాలని చూడకు... అది తిరిగి నీ మీదే పడుతుంది...జాగ్రత్త!

---

రాజధానిలో అభివృద్ధి పనులకు

## కొత్త అంచనాలతో టెండర్లు

- ఐదేళ్లలో జరిగిన నష్టం పరిశీలనకు కమిటీలు
- సామగ్రి దొంగలపై చర్యలు తీసుకుంటాం
- మంత్రి నారాయణ వెల్లడి



అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం అమరావతిలో పర్యటిస్తారని పురపాలకశాఖ, పట్టణాభివృద్ధిశాఖల మంత్రి పీ నారాయణ తెలిపారు. గత ప్రభుత్వం కూల్చివేసిన ప్రజావేదిక వద్ద నుంచి పర్యటన ప్రారంభమవుతుందని చెప్పారు. రాజధానిలో నిలిచిపోయిన పనులను, సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయాన్ని పరిశీలించిన అనంతరం అక్కడే చంద్రబాబు మీడియాతో మాట్లాడతారని చెప్పారు. ముందుగా కమిటీలు వేసి రాజధానిలో జరిగిన నష్టాన్ని పరిశీలించి, అంచనా వేస్తామని మంత్రి వివరించారు. టెండర్ల కాలపరిమితి ముగిసినందున కొత్తగా అంచనాలు తయారు చేసి టెండర్లు పిలవాల్సి ఉందన్నారు. దీనికోసం మూడు నుంచి నాలుగు నెలల సమయం పడుతుందన్నారు. పనులు ఎప్పటి నుంచి ప్రారంభించాలనేది క్యాబినెట్‌లో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. రాజధానిలో సామగ్రి దొంగిలించిన వారిపై చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు. రాజధానిలో ఇళ్ల స్థలాల అంశం సుప్రీంకోర్టులో ఉందని, న్యాయసలహా తీసుకుని ముందుకెళ్తామని మంత్రి తెలిపారు.

---

# ప్రక్షాళన ప్రారంభం

- భారీగా ఐఏఎస్‌ల బదిలీలు
- జగన్ భక్త అధికారులకు నో పోస్టింగ్
- శ్రీలక్ష్మి, ప్రవీణ్‌ప్రకాష్, మురళీధర్‌రెడ్డి జీఏడీకి
- సీఆర్‌డీఏ కమిషనర్‌గా కాటమనేని భాస్కర్

అమరావతి: రాష్ట్రంలో పాలనాపరంగా ప్రక్షాళన మొదలైంది. పెద్ద ఎత్తున ఐఏఎస్‌లను బదిలీ చేశారు. జగన్ సేవలో తరించిన అధికారులకు పోస్టింగ్ ఇవ్వకుండా సాధారణ పరిపాలనా విభాగానికి (జీఏడీ) అటాచ్ చేశారు. కొంత మందికి అప్రాధాన్య పోస్టింగ్‌లుఇచ్చారు.పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌లను జీఏడీకి అటాచ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సెర్ప్ సీఈఓ మురళీధర్ రెడ్డిని కూడా జీఏడీకి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

### బదిలీల వివరాలు

జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి: సాయిప్రసాద్
పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి: శశిభూషణ్ కుమార్
వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి: రాజశేఖర్
కార్మికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి: గోపాలకృష్ణ ద్వివేది
పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి: అనిల్ కుమార్ సింఘాల్
పౌరసరఫరాలశాఖ కమిషనర్: సిద్ధార్థ్ జైన్
ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి: సౌరభ్ గౌర్
నైపుణ్యాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి: సౌరభ్ గౌర్‌కు అదనపు బాధ్యతలు
పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి: కోన శశిధర్
ఐటీ, ఆర్టీజీఎస్ కార్యదర్శి: కోన శశిధర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు
ఉద్యాన, మత్స్యశాఖ సహకార విభాగాల కార్యదర్శి: బాబు.ఎ
ఏపీ సీఆర్డీఏ కమిషనర్: కాటమనేని భాస్కర్
ముఖ్యమంత్రి కార్యదర్శి: ప్రద్యుమ్న
ఆర్థిక వ్యయ విభాగం కార్యదర్శి: ఎం. జానకి
పశు సంవర్థకశాఖ కార్యదర్శి: ఎం. ఎం. నాయక్
గనులశాఖ డైరెక్టర్, కమిషనర్: ప్రవీణ్ కుమార్
ఏపీఎండీసీ ఎండీ: ప్రవీణ్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు
ఆర్థికశాఖ కార్యదర్శి: వి.వినయ్‌చంద్

---

# యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

*- అధికారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశం*



అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు, ఈదురు గాలులకు దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించి, సరఫరాలో ఏమాత్రం అంతరాయం లేకుండా చర్యలుతీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులను రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా కురిసిన వర్షాలు, ఈదురు గాలుల వల్ల వివిధ ప్రాంతాల్లో కూలిన కరెంటు స్తంభాలు, తెగిన వైర్లు, దెబ్బతిన్న ఫీడర్ల పునరుద్ధరణకు అధికారులు తీసుకుంటున్న చర్యలను బుధవారం రాష్ట్ర సచివాలయం నుండి టెలీకాన్ఫరెన్సు ద్వారా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలిపోయిన దెబ్బతిన్న వ్యవస్థలను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రాబోయే 48 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం, ప్రజలకు అసౌకర్యం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల సీఎండీలు, అధికారులు ఈ టెలీకాన్ఫరెన్సులో పాల్గొన్నారు.



రాష్ట్ర నీటిపారుదల శాఖమంత్రి నిమ్మల రామానాయుడును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు, జిల్లా అధికార ప్రతినిధి నల్లా స్వామి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దున్నాల దుర్గ శ్రీను గంధం తదితరులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.



పిడుగురాళ్ల పట్టణంలోని శ్రీ మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని (2024-25) విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులకు సంబంధించిన కిట్స్‌ను నియోజకవర్గ శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు బుధవారం పంపిణీ చేశారు.

## రాజధాని ఎమ్మెల్యే పేరుతో సైబర్ మోసం

**తెనాలి శ్రావణ్ కుమార్ పేరుతో డబ్బులు అడుగుతున్న కేటుగాళ్లు**

**స్పందించొద్దని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే**



తాడికొండ (చైతన్యరథం): అమాయకులే లక్ష్యంగా సైబర్ కేటుగాళ్లు రోజురోజుకీ కొంతపంథా ఎంచుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నూతన ఎమ్మెల్యేల పేరిటా మోసాలకు దిగుతున్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్‌కుమార్ పేరుతో సైబర్ కేటుగాళ్లు ఫేస్‌బుక్ నకిలీ ఎకౌంట్ తెరిచారు. రాజధాని ఎమ్మెల్యే పేరుతో ఎకౌంట్ క్రియేట్ చేసి సామాన్యులతో చాట్ చేస్తూ డబ్బులు అడుగుతున్నారు. తన పేరిట మోసాలకు పాల్పడుతున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రవణ్ కుమార్ వెంటనే స్పందించారు. తన పేరుతో ఎవరు డబ్బులు అడిగినా ఇవ్వొద్దంటూ చెప్పారు. ఇలాంటి మోసాల పట్ల నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ మోసాల బారిన పడి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. ఎమ్మెల్యే పేరిట సైబర్ కేటుగాళ్లు వసూళ్లకు పాల్పడడంతో నియోజకవర్గ ప్రజలు అవాక్కయ్యారు.

## నేడు బాధ్యతలు చేపట్టనున్న ఏడుగురు మంత్రులు

అమరావతి: రాష్ట్రంలో గురువారం నాడు ఏడుగురు మంత్రులు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉదయం 7:30గంటలకు సచివాలయం 5వ బ్లాక్‌లో కార్మిక, ఫ్యాక్టరీలు, ఇన్సూరెన్స్, మెడికల్ సర్వీసెస్ మంత్రిగా వాసంశెట్టి సుభాష్ బాధ్యతలు చేపట్టనున్నారు. 4వ బ్లాక్‌లో 9గంటలకు జలవనరుల శాఖ మంత్రిగా నిమ్మల రామానాయుడు... పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిగా టీజీ భరత్ బాధ్యతలు స్వీకరించనున్నారు. 10:30 గంటలకు దేవదాయ శాఖ మంత్రిగా గొల్లపూడిలోని ఎండోమెంట్ కార్యాలయంలో ఆనం రాంనారాయణ రెడ్డి బాధ్యతలు స్వీకరిస్తారు. సచివాలయం 4వ బ్లాక్‌లో 10:35లకు బీసీ వెల్ఫేర్, ఈడబ్ల్యూఎస్, హ్యాండ్‌లూమ్స్, చేనేత మంత్రిగా సవిత, 11.30లకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ శాఖ మంత్రిగా అనగాని సత్యప్రసాద్ బాధ్యతలు చేపడతారు. ఇక సాయంత్రం 5:30కు టూరిజం, కల్చర్, సినిమాటోగ్రఫీ మంత్రిగా 2వ బ్లాక్‌లో మంత్రి కందుల దుర్గేష్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

## ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలవటం వల్లే ప్రొటెం స్పీకర్ అవకాశం: బుచ్చయ్య చౌదరి



రాజమండ్రి: ఈవీఎంలపై మాజీ ముఖ్యమంత్రి జగన్ అనుమానాలు వ్యక్తం చేయటం దుర్మార్గమని టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ప్రజలంతా తిరుగుబాటు చేసి ఆయన్ను ఓడించారని, కానీ జగన్ మాత్రం ఈవీఎంల వల్లే తాను ఓడిపోయానని చెప్పడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. 2019 ఏపీ ఎన్నికల్లో వైసీపీ 151సీట్లు గెలిచినప్పుడు మాత్రం ఈవీఎంలు బాగా పనిచేశాయా అంటూ ప్రశ్నించారు. తిరిగి బ్యాలెట్ విధానం తీసుకు రావాలని జగన్ కోరడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ ప్రజాధనం దుర్వినియోగం చేసి రుషికొండపై ప్యాలెస్‌లు నిర్మించుకున్నారని ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం ప్రజావేదిక కూల్చివేసినట్లు తమ ప్రభుత్వం కూల్చివేయదని, ప్రభుత్వ కార్యక్రమాలకు ఆ భవనాలను ఉపయోగిస్తామన్నారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలవటం వల్లే తనకు ప్రొటెం స్పీకర్ అవకాశం వచ్చిందన్నారు. ఈనెల 21న జరిగే అసెంబ్లీ సమావేశాలను కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహించి ప్రజా సమస్యలపై చర్చిస్తుందని వెల్లడించారు.

## రామోజీకి అమరావతి ఐకాస నివాళి

**తుళ్లూరులో కొవ్వొత్తుల ర్యాలీ**



తుళ్లూరు: రామోజీ గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావుకు రాజధాని అమరావతి ఐకాస ఘనంగా నివాళులర్పించింది. ఐకాస ఆధ్వర్యంలో తుళ్లూరులో రైతులు బుధవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. రాజధానికి అమరావతి అని పేరు పెట్టింది రామోజీరావు అని, రైతుల ఉద్యమానికి ఆయన అండగా నిలిచారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అమరావతి ఉన్నంతకాలం ఆ మహనీయుని జ్ఞాపకాలను తెలుగు వారు స్మరించుకుంటారని ఐకాస ఛైర్మన్ శివారెడ్డి అన్నారు. రామోజీరావు కార్యదక్షత, పట్టుదల భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అక్షర యోధునికి అమరావతి అశ్రు నివాళులర్పిస్తోందని ఐకాస నేత సుధాకర్ అన్నారు. అమరావతి ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేసిన గొప్ప వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, రాజధాని పరిధిలోని వివిధ గ్రామాల రైతులు, మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు.

## యూజీసీ నెట్ పరీక్ష రద్దు

న్యూఢిల్లీ: నీట్ సహా పలు పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు వస్తోన్న వేళ ఎన్‌టీఏ కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 18న నిర్వహించిన యూజీసీ నెట్-2024 పరీక్ష రద్దు చేసినట్లు ప్రకటించింది. యూనివర్శిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం కోసం జరిపిన ఈ పరీక్షను మళ్లీ నిర్వహించాలని నిర్ణయించింది. నెట్ పరీక్షలో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన యూజీసీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా 1,205 సెంటర్లలో జరిగిన ఈ పరీక్షకు దాదాపు 9లక్షల మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. పారదర్శకతను కాపాడుకోవటం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర విద్యాశాఖ తెలిపింది. ఈ అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని నిర్ణయించింది. పరీక్షల పారదర్శకతకు కట్టుబడి ఉన్నామని కేంద్ర విద్యాశాఖ స్పష్టం చేసింది.

మరోవైపు నీట్ పేపర్ లీకేజీపై వస్తోన్న ఆరోపణలపైనా కేంద్రం స్పందించింది. సమయం కోల్పోయిన విద్యార్థులకు కలిపిన గ్రేస్ మార్కులు రద్దు చేస్తూ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. పట్నాలో నీట్ అవకతవకలపై పోలీసులు విచారణ చేస్తున్నారని వెల్లడించింది. ప్రాథమిక ఆధారాల మేరకు నీట్ లో అవకతవకలు జరిగినట్లు నిర్ధారణకు వచ్చామని, బిహార్ ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని పేర్కొంది.

**తమిళనాడులో ఘోర విషాదం..**

## కల్తీసారా తాగి 10 మంది మృతి

చెన్నై: తమిళనాడులో ఘోర విషాదం చోటుచేసుకుంది. కళ్లకురిచిలో బుధవారం కల్తీ సారా తాగి 10 మంది మృతి చెందారు. నలభై మందికి పైగా అస్వస్థతకు గురికావడంతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనతో తీవ్ర ఆందోళన చెందిన బాధిత కుటుంబ సభ్యులు సారా కేంద్రం వద్ద మృతదేహాలతో ఆందోళనకు దిగడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.

కాగా, కల్తీ సారా మృతుల ఘటనపై సీబీసీఐడీ విచారణకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ శ్రావణ్ కుమార్ బదిలీకి ఆదేశాలు ఇచ్చారు. కల్లకురిచి కొత్త కలెక్టర్‌గా ఎంసీ ప్రశాంత్‌ను నియమించారు. జిల్లా ఎస్పీ సమయ్ సింగ్ మీనాను సైతం సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో కొత్త ఎస్పీగా రాజ్‌నాథ్ చతుర్వేదిని ప్రభుత్వం నియమించారు. పలువురు పోలీసులు అధికారులను సైతం సస్పెన్షన్‌లో ఉంచారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు.

**రాజధాని రైతుల ఆందోళన**

## నాగార్జున వర్శిటీ వద్ద ఉద్రిక్తత



గుంటూరు: అచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ) వద్ద ఉద్రిక్తత నెలకొంది. గతంలో 3 రాజధానులకు అనుకూలంగా సమావేశం నిర్వహించిన వీసీ రాజశేఖర్ రాజీనామాకు అమరావతి ప్రాంత రైతులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో బుధవారం వర్సిటీ వద్ద ఆందోళనకు దిగారు. గేట్లు నెట్టుకుంటూ లోపలికి వెళ్లారు. రాజధాని రైతులను సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుని పక్కకు నెట్టేశారు. వీసీ కార్యాలయానికి తాళం వేశారు. దీంతో రైతులు అక్కడే బైఠాయించారు. వీసీ పోస్టు నుంచి రాజశేఖర్ తప్పుకోవాలని డిమాండ్ చేశారు. రాజధాని రైతుల ఆందోళన నేపథ్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని రైతులకు నచ్చ చెప్పి పంపించారు.

## మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసిన మెడికవర్ ప్రతినిధులు



ఆత్మకూరు చైతన్యరథం: రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిని నెల్లూరులోని మెడికవర్ హాస్పిటల్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించడమే కాకుండా దేవదాయశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని వారు ఆనంను నెల్లూరులోని వారి నివాసంలో కలిశారు. మెడికవర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్ రెడ్డి, మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సెంటర్ హెడ్ డాక్టర్ బింధు రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ సతీష్ బాబు, పిఆర్వో చందు వర్మ, ఆత్మకూరు మున్సిపాలిటి కౌన్సిలర్ సూరా భాస్కర్ రెడ్డి తదితరులు రామ నారాయణరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాతో సత్కరించి, బుద్ధ ప్రతిమను అందజేశారు.

## ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు రెవిన్యూ అధికారుల అభినందనలు



ఆళ్లగడ్డ చైతన్యరథం: ఆళ్లగడ్డ శాసన సభ్యులు భూమా అఖిల ప్రియను ఆళ్లగడ్డ రెవెన్యూ అధికారులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆళ్లగడ్డ తహసీల్దార్ నజీర్ అహ్మద్ ఉప తహసీల్దార్లు రాజీవ్ రెడ్డి చంద్రశేఖరయ్య ఏ ఎస్ ఓ దస్తగిరి రెడ్డి, వీఆర్వోలు సంజీవరాయుడు, గోవిందరెడ్డి, కిషోర్, గుమ్మన్న, పరమేశ్వర రెడ్డి, ఆంజనేయులు, తులసీ వెంకటరమణ, జయవెంక రమణ, విష్ణు వర్ధన్, సునీల్ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ను మర్యాదపూర్వక కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ రెవిన్యూ అధికారులతో మాట్లాడుతూ వారం రోజుల్లో అందరితో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

## ఎమ్మెల్యే ఆదిమూలంను కలిసిన ఎమ్మార్పీఎస్ నేతలు



సత్యవేడు చైతన్యరథం: సార్వత్రిక ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గంలో సత్తా చాటిన టిడిపి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో బుధవారం ఎమ్మార్పీఎస్ నేతలు భేటీ అయ్యారు నారాయణపురం మండలం హరి ఫంక్షన్ హాల్‌లో ముందుగా ఎమ్మెల్యే ఆదిమూలంను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూరిపాక వాసుదేవరావు నేతృత్వంలో ఘనంగా సత్కరించారు ఎన్నికల్లో ఉమ్మడి ఎన్ డి ఏ అభ్యర్థిగా కోనేటి ఆదిమూలం నిలబడడంతో పార్టీ విజయం కోసం ఎంఆర్పిఎస్ నేతలు విస్తృతంగా ప్రచార నిర్వహించి గెలుపుకు దోహదపడ్డారు దీంతో మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు రాగిపట్టు రాఘవయ్య ఎర్రమల్లి సాయికుమార్ గిరిబాబు తదితర నేతలు ఎమ్మెల్యే ను కలిసిన వారిలో ఉన్నారు.

# హోమ్ మినిస్టర్ అనితను కలిసిన బీటెక్ రవి, విజయ్



పులివెందుల చైతన్యరథం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి బుదవారం సెక్రటేరియేట్ నందు రాష్ట్ర హోమ్ మంత్రి వర్యులుగా భాధ్యతలు స్వీకరించిన వంగలపూడి అనితాను పులివెందుల నియోజక వర్గ ఇంచార్జ్ బీటెక్ రవి, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అక్కులుగారి విజయ్ కుమార్ రెడ్డి తదితర టిడిపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. హోమ్ మంత్రిని లింగాల మండల సీనియర్ నాయకులు దేవిరెడ్డి సంజీవ రెడ్డి, చక్రాయపేట మండల ఇంచార్జ్ తాళ్ళపల్లి మహేశ్వర్ రెడ్డి,రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారధి రెడ్డి, సీనియర్ నాయకులు కమటం నాగబూషన్ రెడ్డి తదితర పులివెందుల టీడీపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పులివెందులలో వైసిపి నాయకులు చేసిన దౌర్జన్యాలు అక్రమాలు అరాచకాల గురించి హోం మినిస్టర్ కు వివరించి వాటిని విచారణ జరిపించాలని ఈ సందర్భంగా వారు ఆమెను కోరారు.

# బకాయిలను ఇప్పించాలని ఎమ్మెల్యేలను కోరిన ఎన్జీవో సంఘం





ప్రొద్దుటూరు చైతన్యరథం: ప్రొద్దుటూరు శాసన సభ్యులు నంద్యాల వరద రాజుల రెడ్డిని, మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ని ప్రొద్దుటూరు ఏపీ యన్జిఓస్ అసోసియేషన్, ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షులు కెజె రఘురామిరెడ్డి, కార్యదర్శి రామసుబ్బయ్య కలిసి శు భాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. కొత్తగా యేర్పడ్డ ప్రభుత్వంనకు స్వాగతం పలుకుతూ ప్రొద్దుటూరు, మైదుకూరు తాలూకా పరిధిలోని ఉద్యోగులు ప్రభుత్వ కార్య క్రమములను ప్రజలకు అందించడంలో ముందు ఉంటామని తెలిపారు. గడిచిన ప్రభుత్వంలో సకాలంలో మాకు రావలసిన బకాయిలు రాక చాలా ఇబ్బందులు పద్దా మనీ, ఇప్పుడు వచ్చిన స్నేహ పూరిత ప్రభుత్వంలో తమ న్యాయమైన కోరికలు తీరుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. శాసన సభ్యులు ఇద్దరు మీరు బాగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. అలాగే మీకు ఎ అవసరం వచ్చిన తోడు ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు అసోసియేటెడ్ ప్రెసిడెంట్ సదాశివయ్య, వైస్ ప్రెసిడెంట్స్ శివరామానుజ, మధు సుధనరావు ఆర్గనైజషన్ సెక్రటరీ ప్రభంజనరెడ్డి, జాయింట్ సెక్రటరీ రాజశేఖర్, నాగార్జున, మహేశ్వరయ్య, మాజీ సెక్రటరీ వెంకటేశ్వర్లు హాస్పిటల్ నాయక్, పెన్షనర్స్ నాగన్న, వెంకటరామయ్య శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

# సీఎం చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనం మెగా డీఎస్సీపై తొలి సంతకం

***2023-24వ సంవత్సరం పదోవ తరగతి విద్యా ప్రోత్సాహక బహుమతులు అందించిన పులివర్తి నాని***



రామచంద్రాపురం చైతన్యరథం: తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలంలోని కమ్మకండ్రిగ ప్రభుత్వ పాఠశాలలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని విద్యార్థులకు బుధవారం విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. అనంతరం పులివర్తి నాని మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను అడ్డం పెట్టుకుని అనేక అక్రమాలకు పాల్పడిందన్నారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయదానికి నారా లోకేష్ ను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రిగా నియామకం చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. వారం రోజుల్లో పాఠశాలలో క్రీడలకు, ల్యాబ్ కు కావలసిన పరికరాలను సొంత నిధులతో అందిస్తానని తెలిపారు. అలాగే ఆరు మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మత్తులు వివరాలకు సంబంధించిన నివేదిక కోరానని నివేదిక రాగానే మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని తెలియజేశారు. అనంతరం 2023-24 వ సంవత్సరం పదోవ తరగతి పరీక్ష ఫలితాలలో 513 మార్కులు సాహితి కి మొదటి బహుమతి, 512 మార్కులు ధనలక్ష్మి కి రెండోవ బహుమతి, 505 మార్కులు సాధించిన చారినికి మూడవ బహుమతి ఎమ్మెల్యే పురుగులు తినాలని అందించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ, సర్పంచ్ కావ్య, ఎంతఓలు మార్కండేయ నాయుడు, జయ వేలు, మండల టిడిపి సినీ నాయక జనార్ధన్ చౌదరి, చినబాబు, నరసింహారెడ్డి, ఢిల్లీ నాగిరెడ్డి, పోరా హరి నాయుడు,బాబుయాదవ్,కేశవులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి అభినందనల వెల్లువ





కోవూరు చైతన్యరథం: కోవూరు నియోజకవర్గానికి తొలి మహిళా శాసనసభ్యురాలిగా ఘన విజయం సాధించిన వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని కోవూరు ఆర్య వైశ్య సంఘ మహిళా విభాగ కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నెల్లూరు నగరంలోని విపిఆర్ నివాసానికి చేరుకున్న వారు.. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని శాలువాలు, పుష్ప గుచ్చాలతో సన్మానించి తమ అభిమానం చాటుకున్నారు. అదేవిధంగా విడవలూరు మండలం వావిళ్ళ ఎంపిటిసి సభ్యుడు ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. వావిళ్ళ గ్రామ పరిధిలోని స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అనంతరం కోవూరు నియోజకవర్గ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బి.వెంకయ్య ఆధ్వర్యంలో సాంఘీక సంక్షేమ హాస్టళ్ళ వార్డెన్లు ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలతో సత్కరించారు. కోవూరు, బుచ్చిరెడ్డిపాలెం, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరు పేట మండలాలకు చెందిన సర్వేయర్లు ప్రశాంతి రెడ్డిని శాలువాలతో సత్కరించి తమ అభిమానం చాటుకున్నారు. ఇందుకూరుపేట కొత్తూరు సాయిబాబా ఆలయ ఛైర్మన్ కోదండ రామిరెడ్డి, రావూరు మాజీ ఎంపిటిసి లక్ష్మయ్యతో పాటు స్థానిక టిడిపి నాయకులు గోపాల్ యాదవ్, కొండాపురం టిడిపి మహిళా అధ్యక్షురాలు జయలక్ష్మి తదితరులు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిని కలిసి అభినందనలు అందచేశారు.

చైతన్యరథం

# ప్రపంచ స్థాయి నగరాల్లో ఒకటిగా విజయవాడను అభివృద్ధి చేస్తాం

**- 13వ డివిజన్లో రోడ్డు, జిమ్ శంకుస్థాపనలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్**



**విజయవాడ తూర్పు (చైతన్యరథం):** ప్రపంచ స్థాయి నగరాల్లో ఒకటిగా విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రణాళికలు రూపొందించారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. విజయవాడ నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని చెప్పారు.

బుధవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 13వ డివిజన్ జేడీ నగర్లో రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం మరియు ఎలక్ట్రిసిటీ కాలనీ పార్కులో రూ.15 లక్షలతో జిమ్ ఏర్పాటుకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని పూజలు చేసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. గత పాలకులు నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలోని భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అంతా అస్తవ్యస్తంగా మారిందన్నారు. కొద్ది పాటి వర్షానికే రహదారులపై వర్షం నీరు నిల్వ ఉండేదన్నారు. వర్షం నీరు రోడ్డుపై నిల్వ ఉండకుండా ఉండేందుకు గత చంద్రబాబునాయుడు ప్రభుత్వం రూ.650 కోట్లతో స్టామ్ వాటర్ నిధులతో నగరం మొత్తం పనులు చేపట్టామన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లను బెదిరించడంతో పనులను వదిలేసి వెళ్ళిపోయారని చెప్పారు. ఇప్పుడు మళ్ళీ చంద్రబాబునాయుడు అధికారంలోకి రావడంతో అ నిధులను తెచ్చి నగరంలోని డ్రైనేజీ, మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరుస్తామని చెప్పారు. రహదారులపై నీరు నిల్వ ఉండకుండా చూడటమే కాకుండా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడుతో మాట్లాడి నగరంలోని వరద నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ కూడా ఈ ప్రాంతానికి స్వయంగా పరిశీలించారని చెప్పారు. అమరావతి రాజధాని గురించి అంతర్జాతీయ వార్తా ఛానల్లో కూడా ప్రత్యేక కథనం ప్రసారం అయ్యిందన్నారు. అత్యంత వేగంగా విజయవాడ నగరం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అమరావతి రాజధానిగా ప్రకటించిన తర్వాత మొదటిగా అభివృద్ధి చెందేది విజయవాడ నగరమేనని అన్నారు. ప్రపంచంలో మొదటి పది నగరాల్లో విజయవాడ నగరం ఒకటిగా చంద్రబాబునాయుడు నిలబెట్టి చూపిస్తారని చెప్పారు. 2024లో జరిగిన ఎన్నికల్లో ఈవీఎం మిషన్ల వల్లనే టీడీపీ గెలిపించందని వైఎస్. జగన్మోహన్రెడ్డి అనడం విడ్డూరంగా ఉందన్నారు. 2019 సంవత్సరంలో వైఎస్సార్సీపీ గెలిచినప్పుడు ఈవీఎంల గురించి జగన్మోహన్రెడ్డి ఏం మాట్లాడారో ఒకసారి పరిశీలించాలని అన్నారు. నాలికను మడతేసి మాట్లాడటం జగన్మోహన్రెడ్డికి అలవాటైందన్నారు. జగన్మోహన్రెడ్డికి ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం పరచకుండా దుర్వినియోగ పరిచాడని, కడపలో రాజారెడ్డి విధానాలను ఇక్కడ కూడా అమలు చేయడం వల్లనే ఈ విధమైన ఫలితాలు వచ్చాయన్నారు. ఆ విధానాల వల్లనే వైఎస్సార్సీపీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా ప్రజలు చేశారన్నారు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని సమంగా అందచేస్తామని గద్దె రామ్మోహన్ అన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మూడో సారి ఎమ్మెల్యేగా గెలిచి రోడ్డు పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. జేడీనగర్లోని అన్ని రహదారులను పునఃనిర్మిస్తామని చెప్పారు. గత పాలకులు విజయవాడ నగరాన్ని కుంటు పరిచారని, చెత్త పన్ను వసూలు చేయడంతో పాటుగా అస్తి పన్ను పెంచడానికి వైఎస్సార్సీపీ పాలకులు ప్రయత్నించా రన్నారు. వైఎస్సార్సీపీ పాలకుల విధానాలకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. మరిన్ని అభివృద్ధి పనులు చేసే విధంగా ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు వెళతామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షులు గద్దె ప్రసాద్, పోతంశెట్టి నాగేశ్వరరావు, కొర్రపాటి శ్రీను, శొంఠి నాగేశ్వరావు, సెక్రటరీ సాంబశివరావు, మూల్పూరి బాలకృష్ణ, పెద్ది సుబ్బయ్య, గద్దె తిలక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వబడుల్లో నాణ్యమైన విద్యను అందిండమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యం

**- 12వ డివిజన్లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్**



ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను అందించి పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ లక్ష్యమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పారు. బుధవారం ఉదయం తూర్పు నియోజకవర్గం పరిధిలోని 12వ డివిజన్లో సంజయ్ గాంధీ కాలనీలోని దామోదరం సంజీవయ్య నగర పాలక సంస్థ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ముఖ్యఅతిథిగా హజరై విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు.

## మా కుటుంబం కష్టాల్లో ఉంది ఆదుకోండి

**- టీడీపీ ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజు వద్ద మొరపెట్టుకున్న ఓ మహిళ**



**మడకశిర (చైతన్యరథం):** మా కుటుంబం కష్టాల్లో ఉంది ఆదుకోండి అంటూ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి ఓ తల్లి సహాయం కోరారు. 'నా భర్త అనారోగ్యంతో ఉన్నారు. నా పిల్లలకు మంచి చదువు చదివించి మా కుటుంబాన్ని ఆదుకోండి' అంటూ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుతో ఓ మహిళ మొరపెట్టుకున్నారు. ఆ మహిళ ఆవేదనను విని ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజు చలించిపోయారు. మీ భర్తకు మంచి వైద్యం అందిస్తామని, మీ పిల్లలకు ప్రభుత్వం కళాశాలలో మంచి చదువులు చదివిస్తానంటూ ఎం.ఎస్ రాజు భరోసా కల్పించారు.

## "నేను బడికి పోతా" కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



**అనంతపురం (చైతన్యరథం):** జిల్లా బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండారు శ్రావణీ శ్రీ ప్రారంభించారు. విద్యార్థులకు బడికి పోదాం కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సునీత, తెలుగుదేశం పార్టీ నాయకులు హనుమంత్ రెడ్డి, శ్రీధర్ బాబు, బండమీద పల్లి కాయల రమణ, ముచ్చుకోట శివయ్య, మల్లేష్, ప్రభుత్వ విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నిమ్మలను కలిసిన టీడీపీ రైతు సంఘాల నేతలు

**- రైతులకు సకాంలో నీరందించాలని వినతి**



**అమరావతి (చైతన్యరథం):** రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో టీడీపీ రైతు సంఘాల నేతలు కలిశారు. రైతులకు సకాంలో పంటలకు నీరందించేలా ప్రణాళికలు చేపట్టాలని కోరారు. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు, రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి గుండపనేని ఉమా వరప్రసాద్, కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు,గోదావరి పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పొత్తూరు రామాంజనేయ రాజు తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి గుండె లాంటిదని దానిని వెంటనే పూర్తి చేయాలని నిమ్మల రామానాయుడు కోరారు. రైతు బాంధవుడిగా పేరున్న నిమ్మల రామానాయుడుకి అత్యంత కీలకమైన జలవనరుల శాఖను అప్పగించడం సంతోషంగా ఉందని, ప్రాధాన్యత క్రమంలో రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించి రైతులకు నీరందించాలని కోరారు.

రాబోయే నాలుగు సీజన్లలో పోలవరం ప్రాజెక్టు 45.72 మీటర్ల ఎత్తులో,194 టీ.ఎం.సీ.ల పూర్తి సామర్థ్యంతో,960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో పూర్తవటం ఖాయమని, దీనితో 900 గ్రామాలకు తాగునీరు, 7 లక్షల ఎకరాల నూతన ఆయకట్టు, ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి 13 జిల్లాలలోని 50 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, విశాఖ పారిశ్రామిక వాడ అవసరాలకు 24 టీ.ఎం.సీ.ల నీరు అందుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు.

## నరసరావుపేట బస్ స్టాండులో ఆక్రమణలు తొలగించండి

**- ఆర్టీసీ ఆర్ఎం,ఆర్టీసీ డిఎంతో కలిసి సదుపాయాలను పరిశీలించిన ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు**



**నరసరావుపేట (చైతన్యరథం):** ప్రయాణాల నిమిత్తం బస్టాండుకు వచ్చే ప్రజలకు సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో సదుపాయాలను ఆర్టీసీ ఆర్ఎం,ఆర్టీసీ డీఎంతో కలిసి పరిశీలించారు. గత ప్రభుత్వంలో ఆక్రమణకు గురైన స్థలాలను,చిన్న భిన్నంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ ను చూసి అసహనం వ్యక్తం చేశారు. ప్రయాణం బడలికతో వచ్చిన ప్రజలు బస్టాండ్ కు చేరగానే ప్రశాంతంగా కనిపించాలి గాని అపస్థలమయమై కనిపించకూడదని తెలిపారు.

తక్షణమే ఆక్రమణలను తొలగించి ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, ఆర్టీసీ అధికారులు,టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.